



జడ్పీ కార్యాలయం వద్ద కన్నయ్యగూడ గ్రామస్థుల ఆవేదన



వేదికపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు తదితరులు

మౌలిక సదుపాయాలపై దృష్టి

- 15న అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తాం
- త్వరలో ఆకస్మిక తనిఖీలు చేస్తా
- కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో సీఎం చంద్రబాబు



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

శ్రీకాకుళం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైమరీ సెక్టార్స్, నేచురల్ రిసోర్సెస్, సెకెండరీ సెక్టార్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, హ్యూమన్ రిసోర్స్, సోషల్ సెక్టార్, అర్బన్, రూరల్ డెవలప్‌మెంట్, రెవెన్యూ, సర్వీస్ సెక్టార్.. ఇలా అన్ని విభాగాలపై జిల్లాల వారీగా అధికారులతో చర్చించారు. 'ఈ నెల 15న అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నాం. త్వరలో నేను కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తాను. రిమోట్ ఏరియాలకు కూడా వెళ్లి అక్కడ సమస్యలను తెలుసుకోవాలి' అని చంద్రబాబు కలెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ప్రణాళికను.. ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ముఖ్యమంత్రికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో అప్పారావు, జడ్పీసీఈవో వెంకటేశ్వరరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అయ్యా.. మా ఊరికి రోడ్డేయండి

- ఇప్పటికీ డోలిల్లోనే రోగుల తరలింపు
- పాఠశాలకు వెళ్లాలంటే 4 కిలోమీటర్లు నడవాల్సిందే
- కన్నయ్యగూడ గిరిపుత్రుల ఆవేదన
- సమస్యలు పరిష్కరించాలని

'మీ కోసం'లో వేడుకోలు

కలెక్టరేట్, ఆగస్టు 5: వారు ప్రకృతి ఒడిలో బతుకుతున్న అడవిబిడ్డలు. ఆ గ్రామంలో ఎవరికైనా అనారోగ్యం చేస్తే.. డోలీలు కట్టి రోగులను మోసుకుంటూ ఆసుపత్రికి తరలించాల్సిన దుస్థితి. చిన్నారులు చదువుకునేందుకు పాఠశాలకు వెళ్లాలన్నా సరైన రోడ్డు సదుపాయం లేదు. రాళ్లు, రప్పలతో కూడుకున్న దారుల్లో నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లాల్సిందే. ఇదీ సారవకోట మండలం మాసింగి పంచాయతీ కన్నయ్యగూడ గ్రామస్థుల దయనీయ పరిస్థితి. మా ఊరికి రోడ్డు వేసి ఆదుకోండి అంటూ గిరిజనులు అధికారులకు ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అయినా సరే ఆశతో మళ్లీ సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న 'మీ కోసం' కార్యక్రమంలో డీఆర్వో అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు.



కన్నయ్యగూడకు ఇదే నడక దారి

- అనంతరం కన్నయ్యగూడ గిరిజనులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. తమ కష్టాలను వెల్లడించారు. 'మా గ్రామానికి నడకదారి మాత్రమే ఉంది. సరైన రహదారి సదుపాయం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్యానికి గురైన వారిని డోలీల్లో మోసుకుంటూ ఆసుపత్రికి తరలిస్తున్నాం. 1 నుంచి 5వ తరగతి వరకు చదివే చిన్నారులు అదే రోడ్డులో నడుస్తూ.. 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణపురం పాఠశాలకు చేరుకోవాలి. ఏడాదికి మూడు, నాలుగుసార్లు అయినా అధికారులను కలిసి.. మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని అర్జీలు సమర్పిస్తూనే ఉన్నాం. అయినా సమస్య పరిష్కారం కావడం లేదు. ఎన్నికల సమయంలో కొంతమంది వ్యక్తులు వచ్చి.. వెళ్లిపోతారు. కానీ మా సమస్యలు మాత్రం పట్టించుకోరు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

దేవదాయ శాఖలో సర్దుబాట్లు

- ఏళ్ల తరబడి భర్తీకాని పోస్టులు
- డిప్యుటేషన్లపై కొనసాగుతున్న ఈవోలు
- జిల్లాలో ఆ శాఖలో ఒకే ఒక ఇన్‌స్పెక్టర్
- అదనపు బాధ్యతలతో కొరవడుతున్న పర్యవేక్షణ

(టెక్కలి)



శ్రీకూర్మం దేవస్థానం

దేవదాయ శాఖ పరిధిలో సరిపడా సిబ్బంది లేక ఉన్న ఉద్యోగులతోనే డిప్యుటేషన్లు, పని సర్దుబాటు పేరుతో నెట్టుకొస్తున్నారు. జిల్లాల పునర్విభజన జరిగినా.. ఈ శాఖలో మాత్రం పాత జిల్లాల పద్ధతిలోనే పాలన కొనసాగడం గమనార్హం. జిల్లాలో రూ.25లక్షల ఆదాయం దాటిన 6ఏ పరిధిలో.. అరసవల్లి, శ్రీకూర్మం, రావివలస ఎండల మల్లన్న, కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి, పాతపట్నం నీలమణి దుర్గమ్మ వంటి దేవాలయాలు ఉన్నాయి. రూ.ఐదు లక్షల నుంచి రూ.25 లక్షల ఆదాయం లోపు 6బీ పరిధిలో 19 ఆలయాలు, అర్చకుల పరిధిలో (6సీ) 732 ఆలయాలు, 6డీ పరిధిలో 17 మఠాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు సంబంధించి పలువురు ఈవోలు డిప్యుటేషన్లపైనే ఎక్కువగా కొనసాగుతున్నారు. సోంపేట గ్రూప్‌టెంపుల్స్ ఈవో బి.రామారావుకు ఇచ్ఛాపురం అదనపు బాధ్యతలు, ఆమదాలవలస ఈవో పి.రవికి నరసన్నపేట అదనపు బాధ్యతలు అప్పగించారు. పాలకొండ కోటదుర్గమ్మ ఆలయ ఈవో సర్వేశ్వరరావుకు శ్రీకాకుళం రుద్రకోటేశ్వరస్వామి ఆలయం, పాతపట్నం నీలమణిదుర్గ ఆలయ ఈవో వాసుదేవరావుకు మందస, పలాస టెంపుల్స్ ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు. కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఆలయ ఈవో వాకచర్ల రాధాకృష్ణకు టెక్కలి మండలం రావివలస ఎండలమల్లికార్జునస్వామి ఆలయానికి, శ్రీకాకుళం టెంపుల్స్ ఈవో జి.గురునాథరావు శ్రీకూర్మం ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా తోటపల్లి ఈవో వీవీ నారాయణ.. రావివలస ఎండమల్లిఖార్జునస్వామి ఆలయం నుంచే పని సర్దుబాటు కింద జీతం తీసుకుంటున్నారు.

- ఇక జిల్లాలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకుగాను శ్రీకాకుళం ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్‌లో ఉన్నారు. ప్రస్తుతం సోంపేట ఇన్‌స్పెక్టరే జిల్లాలో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటు ఈవోలు, అటు ఇన్‌స్పెక్టర్లు సుదూర ప్రాంతాల్లో అదనపు బాధ్యతలు మోయాల్సి వస్తోంది. ఆయా ఆలయాల పర్యవేక్షణ సక్రమంగా సాగడం లేదు. మరోవైపు జిల్లాలో గ్రేడ్-1 ఈవో పోస్టులు రెండు ఉండాల్సి ఉండగా.. ఒక్కరే ఉన్నారు. జిల్లాలో వివిధ ఆలయాలు పరిధిలో రూ.15కోట్ల సీజీఎఫ్ నిధులతో ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇటు ఆలయ ఆస్తులు కాపాడడం, భూములు అన్యాక్రాంతం కాకుండా చూడడం, లోపాల సరిదిద్దడం, ఆలయాల పర్యవేక్షణ తదితర బాధ్యతలు ఇన్‌చార్జిలకు తలనొప్పిగా మారాయి. సంవత్సరాల తరబడి ఈ పోస్టులు భర్తీ కాకపోవడంతో.. ఆలయాల అభివృద్ధి కూడా సక్రమంగా సాగడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి దేవదాయశాఖలో పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.
- ఈ విషయమై దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ వద్ద ప్రస్తావించగా ఖాళీలన్నీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కొన్ని పోస్టులు ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సి ఉందని తెలిపారు.

'పేట'లో అక్రమ నిర్మాణాలు



- రెసిడెన్షియల్ పేరిట కమర్షియల్ కాంప్లెక్స్‌లు
- నిబంధనలకు తిలోదకాలు
- పట్టించుకోని అధికారులు

(నరసన్నపేట)

నరసన్నపేట మేజర్ పంచాయతీలో జి+2 దాటి బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. భవన యజమానులు రెసిడెన్షియల్‌కు అనుమతులు తీసుకుని కమర్షియల్ కాంప్లెక్స్‌గా నిర్మిస్తున్నారు. పంచాయతీ ఆదాయానికి ఏటా రూ.లక్షల్లో గండి కొడుతున్నారు. మెయిన్ రోడ్డుతో పాటు పలు వీధుల్లో జి+2 దాటి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. సుడా నిబంధలకు విరుద్ధంగా చిన్న చిన్న స్థలాల్లో భారీ భవనాలు నిర్మిస్తున్నారు. రోడ్లు, కాలువలు, కనీస వసతులు కూడా లేకపోవడంతో పరిసర ప్రాంతాలు మురికి కూపాలుగా మారుతున్నాయి. అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- నరసన్నపేటలోని మఠంవీధి, కళాశాల రోడ్డు, సత్యవరం జంక్షన్, పాతబస్టాండ్, నేతాజీ వీధి, మారుతీనగర్, శ్రీరామనగర్, బండివీధి, వీరన్నాయుడు కాలనీ, ఇందిరానగర్, గాంధీనగర్, గొట్టివల్ల రోడ్డు తదితర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి.
- జమ్ము జంక్షన్ నుంచి సత్యవరం జంక్షన్ వరకు పలు ప్రాంతాల్లో నిర్మిస్తున్న భవనాలకు పార్కింగ్ స్థలాలు లేవు. రోడ్లపైనే వాహనాలు నిలుపుదల చేస్తుండటంతో తరుచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ ప్రాంతంలో బహుళ అంతస్తులు నిర్మిస్తున్న భవన యాజమానులు అధికారుల అండతో సుడా నుంచి రెసిడెన్సియల్ అనుమతులు తీసుకుని కమర్షియల్ కాంప్లెక్స్‌లుగా ఉపయోగిస్తున్నారు. రెసిడెన్షియల్‌కి, కమర్షియల్‌కి చదరపు గజానికి రూ.25వరకు తేడా వస్తోంది. ఈ క్రమంలో ఒక్కో భవనం నుంచి పంచాయతీకి ఏటా రూ.వేలల్లో ఆదాయం నష్టం. మెయిన్ రోడ్డుపై ఉన్న అన్ని భవనాలు లెక్కిస్తే.. నరసన్నపేట పంచాయతీ రూ.కోట్లలో ఆదాయం కోల్పోతోందని అధికారులే ఒప్పుకుంటున్నారు. దీనికితోడు జి+2 దాటిన నిర్మాణాలకు సుడా అనుమతి తీసుకోవాలి. ఇది కూడా పంచాయతీకి నష్టమే. ఇలా నరసన్నపేట పంచాయతీకి అన్ని విధాలా నష్టం చేకూరుస్తున్న బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలను అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సామాన్యులు తలదాచుకునేందుకు పాకలు వేస్తే.. ఆదరబాదరాగా వెళ్లి తొలగించే పంచాయతీ అధికారులు.. అక్రమ నిర్మాణ భవనాల జోలికి మాత్రం పోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నోటీసులు ఇస్తాం

రెసిడెన్షియల్ పేరిట అనుమతి తీసుకుని.. కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించిన వాటిని గుర్తించి నోటీసులు ఇస్తాం. బండివీధిలో చేపట్టిన నిర్మాణాలపై పంచాయతీ అధికారులకు సంప్రదించారు. అయితే జీ ప్లస్ 2 నిర్మాణాలు చేపడుతున్నట్లు యాజమాని చెప్పడంతో సుడా నుంచి అనుమతులు తీసుకోమని చెప్పాం. పొన్నాన సోమేశ్వరరావు ఆసుపత్రి పక్కన చేపడుతున్న భవనానికి మాత్రం రెసిడెన్షియల్ అనుమతులు ఇచ్చాం. అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి.. చర్యలు తీసుకుంటాం.

- సవర చిన్నారావు, ఇన్‌చార్జి ఈవో, నరసన్నపేట

రియల్ దందా

- సాగునీటి కాలువపై అనధికార వంతెన
- పొలాలు ముంపునకు గురవుతాయని

రైతుల ఆందోళన

(సంతబొమ్మాళి)

అదొక అక్రమ లే అవుట్. ఆ లేఅవుట్‌కు వెళ్లేందుకు దారి లేక.. రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఏకంగా సాగునీటి కాలువపై అనధికారికంగా వంతెనే నిర్మించేశారు. దీంతో పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. సంతబొమ్మాళి పంచాయతీ జగన్నాథపురం(రెయ్యపేట) వద్ద సర్వే నెంబరు 190-1లో 0.58 విస్తీర్ణంలో ఓ రియల్‌ఎస్టేట్ వ్యాపారి అక్రమ లే అవుట్ వేశారు. ఈ లే-అవుట్‌కు వెళ్లేందుకు దారి లేకపోవడంతో.. పక్కనే ఉన్న వంశధార కాలువపై అనుమతులు లేకుండా ఏకంగా వంతెన కట్టేశారు. ఈ కాలువ ద్వారా సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి, మెళియాపుట్టి, నందిగాం, పాతపట్నం మండలాల నుంచి సాగునీరు కాకరాపల్లి తంపరకు వస్తుంది. అక్కడి నుంచి సముద్రంలో కలుస్తుంది. అటువంటి కాలువపై అధికారుల అనుమతి లేకుండా కాంక్రీట్ వంతెన నిర్మించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి ప్రవాహానికి ఆటంకం కలిగి.. వరిపంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఇప్పటికే చిన్న వర్షం కురిస్తే చాలు.. రెయ్యపేట నుంచి పాలేశ్వరస్వామి ఆలయం వరకూ డీపీఎస్ రోడ్డుపై వరదనీరు చేరి.. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొంటున్నారు. వంతెన నిర్మాణంతో మరింత ముంపు తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి.. అక్రమ వంతెన నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై వంశధార జేఈ సింహాచలం వద్ద ప్రస్తావించగా.. జగన్నాథపురం వద్ద సాగునీటి కాలువపై వంతెన నిర్మాణానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు. దీనిపై పరిశీలించి.. అనుమతి లేని నిర్మాణాలు తొలగిస్తామని తెలిపారు.



సాగునీటి కాలువపై అక్రమంగా నిర్మించిన వంతెన



సావిత్రమ్మ మృతదేహం



మెట్టవలసలో వృద్ధురాలికి చికిత్స చేస్తున్న వైద్యులు

మెట్టవలసలో అదుపులోకి రాని డయేరియా

- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు
- గ్రామాన్ని సందర్శించిన అధికారులు
- ఇంటింటా సర్వే.. నమూనాల సేకరణ

జి.సిగడాం, ఆగస్టు 5: జి.సిగడాం మండలం మెట్టవలసలో డయోరియా అదుపులోకి రాక రోగుల సంఖ్య పెరుగుతోంది. శ్రీకాకాళం, రాజాం, పొందూరు ఆస్పత్రుల్లో బాధితులు చికిత్స పొందుతున్నారు. రాజాం సామాజిక ఆసుపత్రిలో 23 మంది, పొందూరు సామాజిక ఆస్పత్రిలో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. మరికొందరు ఇంటివద్దే డయేరియాతో బాధపడుతూ.. ఆర్ఎంపీల ద్వారా చికిత్స పొందుతున్నారు. గ్రామంలో సుమారు 47మంది వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నట్టు సమాచారం. గ్రామానికి చెందిన పైల సావిత్రమ్మ(75) అనే వృద్ధురాలు సోమవారం ఇంటి వద్దనే మృతి చెందింది. కాగా.. అధికారులు మాత్రం ఆమె అనారోగ్యంతో మృతి చెందిందని చెబుతున్నారు. సోమవారం పలువురు అధికారులు గ్రామంలో ఇంటింటా సర్వే చేశారు. కొంతమంది బాధితులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. తాగునీటి వనరులు, నేల బోరుల వద్ద పారిశుధ్యాన్ని పరిశీలించారు. జిల్లా ఎపిడమాలజిస్ట్ అధికారి సుజాత.. గ్రామంలోని తాగునీటి నమూనాలు. ఆహారం, మలవిసర్జనలను సేకరించి.. పరీక్షల నిమిత్తం రిమ్స్‌కు పంపించారు. సీజనల్ వ్యాధులు తగ్గేవరకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను మూసివేయాలని అధికారులకు ఆదేశించారు. గ్రామ సమీపంలో కోళ్లఫారాల వలన వచ్చే దుర్వాసన కూడా డయేరియా వ్యాప్తికి కారణమని తెలిపారు. కోళ్లఫారాల నుంచి ఈగలు, దోమలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తా

- 20 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు
- ఆస్పత్రికి తరలించిన స్థానికులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 5: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం జట్టిపద్ర- జోగుపురం గ్రామాల మధ్య మలుపు వద్ద ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. బస్సులో ఉన్న 20 మంది విద్యార్థులతోపాటు డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. బస్సు బోల్తా పడిన ఘటన తెలుసుకుని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఎవరికీ ప్రాణనష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే..

ఇచ్ఛాపురం మండలం ఎం.తోటూరులోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సు. సోమవారం ఉదయం సుమండి పరిసర గ్రామాల నుంచి 20మంది విద్యార్థులను తీసుకువస్తోంది. జట్టిపద్ర- జోగుపురం గ్రామాల మధ్య మలుపు వద్ద బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. విద్యార్థులు ఆర్తనాదాలు పెట్టడంతో స్థానికులు అక్కడకు చేరుకున్నారు. బస్సు అద్దాలు పగులకొట్టి లోపల ఉన్న చిన్నారులకు బయటకు తీసుకున్నారు. డ్రైవర్‌తోపాటు విద్యార్థులందరికీ స్వల్పగాయాలు కావడంతో పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకుని.. ఆందోళన చెందారు. కాగా.. ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యుడు ఉలాల శేషయాదవ్ చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆస్పత్రిలో చిన్నారులను ఎమ్మెల్సీ నర్తు రామారావు, మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ ఛైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, ప్రకాష్‌రావు పట్నాయక్ పరామర్శించారు. ఎంఈవో అప్పారావు కూడా ఆస్పత్రికి చేరుకుని ప్రమాద ఘటనపై ఆరా తీశారు.



బోల్తా పడిన ప్రైవేటు స్కూల్ బస్సు

దిక్సూచి DIKSUCHI

ఆర్మీ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్



ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్)- బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిని మహిళలకు ఉద్దేశించారు. కోర్సు వ్యవధి నాలుగేళ్లు. నీట్ యూజీ 2024 స్కోర్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్), సైకలాజికల్ అసెస్‌మెంట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అర్హతలు: అవివాహిత/డైవోర్స్‌డ్/లీగల్లీ సెపరేటెడ్ మహిళలు, వితంతువులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్(బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. నీట్ యూజీ 2024 స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులు 1999 అక్టోబరు 1 నుంచి 2007 సెప్టెంబరు 30 మధ్య జన్మించి ఉండాలి. కనీసం 152 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. పద్దెనిమిదేళ్ల లోపు వయసు ఉన్న వారిని రెండు సెంటీమీటర్లు తక్కువగా ఉన్నప్పటికీ అనుమతిస్తారు. ఎన్‌సీసీ-సీ అర్హత ఉన్నవారు సంబంధిత సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలి.

ఎంపిక: అభ్యర్థులను నీట్ యూజీ 2024 స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్) నిర్వహిస్తారు. ఇందులో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే అర మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం అర్ధ గంట. ఇందులో అర్హత పొందినవారిని సైకలాజికల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో ఇంటర్ స్థాయి కోర్ సబ్జెక్టుల నుంచి; హాబీస్; జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. క్రీడల్లో పాల్గొన్న అనుభవం ఉన్నవారికి అదనపు వెయిటేజీ ఉంటుంది. తరవాత ఢిల్లీ బేస్ హాస్పిటల్ స్పెషల్ మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. పై స్కోర్లన్నింటినీ పరిగణనలోకి తీసుకొని మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 7
- వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. మొత్తం 170 సీట్లు ఉన్నాయి.

స్పెషలైజేషన్లు-సీట్లు: ఇంగ్లీష్ 6, తెలుగు 19, ఉర్దూ 3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్ 8, హిస్టరీ 8, పొలిటికల్ సైన్స్ 10, సోషియాలజీ 20, ఆంత్రోపాలజీ 9, ఎడ్యుకేషన్ 2, రీజనల్ స్టడీస్ 5, ఇండియన్ డయాస్పోరా 2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ 4, జెండర్ స్టడీస్ 5, ఎకనామిక్స్ 28, డ్యాన్స్ 3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్ 1, కమ్యూనికేషన్ 3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్ 8, హెల్త్ సైన్స్-ఆప్టోమెట్రీ 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 16, నానోసైన్స్ అండ్ టెక్నాలజీ 4 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ఇతర/తత్సమాన అర్హతల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 14
- హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్: అక్టోబరు 10 నుంచి
- తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం: హైదరాబాద్
- ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(రాత పరీక్ష) తేదీలు: అక్టోబరు 19, 20
- ఇంటర్వ్యూలు: నవంబరు 18 నుంచి 21 వరకు
- ఇంటర్వ్యూలో ఎంపికైనవారి జాబితా విడుదల: డిసెంబరు 2
- కౌన్సెలింగ్: డిసెంబరు 10, 11
- తరగతులు ప్రారంభం: 2025 జనవరి 2 నుంచి
- వెబ్‌సైట్: www.uohyd.ac.in

ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

4455 ఖాళీలు



దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్ పీవో/ఎంటీ- XIV) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ ఆగస్టు 21. వెబ్‌సైట్: https://ibps.in/

- సీఆర్‌పీ ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజ్‌మెంట్ ట్రెయినీ - XIV

ఖాళీలు: 4,455(ఎస్సీ-675, ఎస్టీ-332, ఓబీసీ-1185, ఈడబ్ల్యూఎస్-435, యూఆర్-1846)

ఖాళీలున్న ప్రభుత్వరంగ బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

అర్హత: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై అభ్యర్థులు అర్హులు

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.175; ఇతరులు రూ.850 చెల్లించాలి.

ఎంపిక: ప్రిలిమినరీ, మెయిన్ రాత పరీక్షలు, ఇంటర్వ్యూ, ధ్రువ పత్రాల పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: అనంతపురం, ఏలూరు, గుంటూరు/విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్.

మెయిన్ పరీక్ష కేంద్రాలు: గుంటూరు/విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్.

పరీక్ష విధానం

ప్రిలిమ్స్ రాత పరీక్ష(ఆబ్జెక్టివ్ టెస్ట్): ఈ పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 30 ప్రశ్నలు(30 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 35 ప్రశ్నలు (35 మార్కులు), రీజనింగ్ నుంచి 35 ప్రశ్నలు(35 మార్కులు) ఇస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ప్రశ్న పత్రం ఉంటుంది. ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ మార్కుల మేరకు అర్హత సాధించిన వారిని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామినేషన్(ఆబ్జెక్టివ్/డిస్క్రిప్టివ్): ఈ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్న పత్రంలో మొత్తం 155 ప్రశ్నలు ఉంటాయి. పరీక్షను ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ నుంచి 45 ప్రశ్నలు(60 మార్కులు), జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ నుంచి 40 ప్రశ్నలు(40 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 35 ప్రశ్నలు(60 మార్కులు) ఇస్తారు. పరీక్ష వ్యవధి 3 గంటలు.

ఇంగ్లీష్ లాంగ్వేజ్(లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే): 2 ప్రశ్నలు ఇస్తారు. 25 మార్కులు కేటాయించారు. ఈ పరీక్షకు నిర్దేశించిన సమయం 30 నిమిషాలు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/WP5N39qలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

అద్భుతమైన విజువల్స్‌తో 'చుట్టమల్లే'



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'ఫియర్' సినిమాపై అంచనాలను తారస్థాయిలో పెంచాయి. సోమవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను విడుదల చేశారు. 'చుట్టమల్లె' అంటూ సాగే ఈ రొమాంటిక్ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ, అద్భుతమైన విజువల్స్ అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా, శిల్పా రావ్ ఆలపించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం, బాస్కో మార్టిస్ కొరియోగ్రఫీ అందించారు. కాగా, 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది.

పతాక సన్నివేశాల చిత్రీకరణ




అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పుష్ప 2'. డైరెక్టర్ సుకుమార్, నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ సీక్వెల్‌ను 'పుష్ప పార్ట్ 1'ను మించి ఉండేలా ప్రతీ విషయంలో జాగ్రత్త పడుతున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, రెండు పాటలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. చిత్రీకరణను దాదాపు పూర్తి చేసుకుందీ చిత్రం. ప్రస్తుతం, ఈ సినిమాకు సంబంధించిన క్లైమాక్స్ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన ఓ భారీ సెట్‌లో జరుగుతోంది. ఈ సెట్‌లో అల్లు అర్జున్‌తో పాటు ఇతర కీలక తారాగణం పాల్గొంది. ఈ క్లైమాక్స్ ఎపిసోడ్ థియేటర్స్‌లో గూస్‌బంప్స్ తెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. డిసెంబరు 6న సినిమా విడుదల కానుంది.

మళ్లీ కలసి నటిస్తారా?



ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపుదిద్దుకోనున్న 'స్పిరిట్' చిత్రం స్క్రిప్ట్ వర్క్ దాదాపు పూర్తయింది. ఈ ఏడాది చివరిలో షూటింగ్ మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి. పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ సినిమాలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరా అనే చర్చ చాలా రోజులుగా జరుగుతోంది. తాజాగా త్రిష పేరు వినిపిస్తోంది. ఆమెతో దర్శకుడు సందీప్ మాట్లాడారనీ, ఆమె కూడా ఓకే చెప్పారనీ సమాచారం. ప్రభాస్, త్రిష కాంబినేషన్‌లో 'వర్షం', 'పౌర్ణమి', 'బుజ్జిగాడు' చిత్రాలు వచ్చాయి. 16 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ జంట 'స్పిరిట్' లో కలసి నటించనున్నారన్నమాట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి సరసన 'విశ్వంభర' చిత్రంలో త్రిష నటిస్తున్నారు.

రెండు భాగాలుగా విజయ్ సినిమా



విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'వీడీ 12'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని సూర్య దేవరనాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాలో విజయ్ లుక్‌ను రిలీజ్ చేశారు. కంప్లీట్ రఫ్ లుక్‌లో ఉన్న విజయ్‌ను చూసి బ్లాక్‌బస్టర్ హిట్ ఖాయం అని అభిమానులు సినిమాపై అంచనాలు పెంచేసుకున్నారు. తాజాగా, జరిగిన ఓ మీడియా సమావేశంలో చిత్ర నిర్మాత ఈ సినిమా ఓ గురించి ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. "గౌతమ్ తిన్ననూరి, విజయ్ కలియకలో తెరకెక్కే సినిమా కోసం దర్శకుడు అద్భుతమైన కథను రాసుకున్నారు. రెండు భాగాలకూ సరిపడా కంటెంట్ ఆయన రాసిన కథలో ఉంది . మొదటి భాగం ఫలితాన్ని బట్టి రెండో భాగం తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తాం" అని చెప్పారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 28న విడుదల కానుంది.



ఆప్ ప్రభుత్వానికి సుప్రీం షాక్

ఎంసీడీలో నామినేటెడ్ సభ్యుల నియామక అధికారం ఎల్జీకే

- మంత్రిమండలి సలహాను పాటించనక్కర్లేదన్న ధర్మాసనం



న్యూఢిల్లీ/చెన్నై, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద దెబ్బ తగిలింది. చట్టం ప్రకారం ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ)లో సభ్యులను నామినేట్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ)కే ఉందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ విషయంలో రాష్ట్ర మంత్రిమండలి సలహా, సూచనలను ఎల్జీ పట్టించుకోనవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు చెప్పింది. 10 మంది సభ్యులను ఎల్జీ నామినేట్ చేయడాన్ని సవాలు చేస్తూ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై విచారణను 15 నెలల క్రితమే పూర్తిచేసిన సుప్రీంకోర్టు అప్పుడు రిజర్వు చేసిన తీర్పును తాజాగా వెల్లడించింది. ప్రత్యేక పరిజ్ఞానం ఉన్న వ్యక్తులను ఎంసీడీకి నామినేట్ చేసే అధికారాన్ని ఎల్జీకి కల్పిస్తూ 1993లో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం-1957కు సవరణలు చేశారని ధర్మాసనం తెలిపింది. ఎంసీడీలో 250 మంది ఎన్నికైన, 10 మంది నామినేటెడ్ సభ్యులు ఉంటారు. 2022 డిసెంబరులో జరిగిన ఎంసీడీ ఎన్నికల్లో ఆప్ విజయం సాధించింది. మెజారిటీ మార్కు 126 స్థానాలు కాగా, ఆప్ 134, బీజేపీ 104, కాంగ్రెస్ 9 స్థానాలు గెలుపొందాయి. అనంతరం 10 మంది సభ్యులను ఎల్జీ నామినేట్ చేయగా, మంత్రిమండలి సూచించిన వ్యక్తులను ఎల్జీ నామినేట్ చేసేలా ఆదేశించాలని కోరుతూ ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించింది. కాగా, ఎంసీడీలో సభ్యులను నామినేట్ చేసే అధికారాన్ని ఎల్జీకి ఇవ్వడం వల్ల ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన స్థానిక సంస్థను ఆయన అస్థిర పరిచే అవకాశం ఉందని విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో, తాజా తీర్పు ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ అని ఆప్ పేర్కొంది. విచారణ సందర్భంగా సీజేఐ, జడ్జిలు చేసిన వ్యాఖ్యలకు ఈ తీర్పు పూర్తి భిన్నంగా ఉందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు.

యూట్యూబ్ ఛానళ్ల నియంత్రణకు మద్రాస్ హైకోర్టులో పిల్

యూట్యూబ్ చానళ్ల నియంత్రణకు తగిన విధివిధానాలు రూపొందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాలని మద్రాసు హైకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. చెన్నైకి చెందిన పార్తీబన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్‌లో.. యూట్యూబ్ ఛానళ్లను నియంత్రించే విధానం లేకపోవడంతో ఆయా ఛానళ్లు క్రిమినల్ కేసులపై ఇష్టానుసారంగా ప్రసారం చేస్తున్నాయని, ఇది పోలీసుల విచారణపై ప్రభావం చూపుతోందని అన్నారు. ఈ ఛానళ్ల నియంత్రణకు విధివిధానాలు రూపొందించేలా ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థించారు.

అభ్యర్థిత్వం రద్దుపై ఢిల్లీ హైకోర్టుకు ఖేద్కర్

వివాదాస్పద మాజీ ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అభ్యర్థిత్వాన్ని యూపీఎస్సీ రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆమె సమర్పించిన పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. పూజా ఖేద్కర్.. మోసపూరితంగా ఓబీసీ, వికలాంగుల కోటాలో ఉద్యోగం పొందినట్లు ఆరోపణల నేపథ్యంలో ఏకసభ్య కమిషన్ నివేదిక మేరకు యూపీఎస్సీ ఆమె సభ్యత్వాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే.

మృత్యు కుహరాలుగా కోచింగ్ సెంటర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: కోచింగ్ సెంటర్లు మృత్యు కుహరాలుగా మారాయని సోమవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అవి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయని విమర్శించింది. పాత రాజేందర్‌నగర్‌లోని రావ్స్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లోని బేస్‌మెంట్‌లో వరదల కారణంగా ముగ్గురు విద్యార్థులు మరణించిన ఘటనపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది. కోచింగ్ సెంటర్లలో భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ఆదేశించింది. ఈ దుర్ఘటన అందరికీ కనువిప్పు కావాలని ఆకాంక్షించింది. మరోవైపు అన్ని కోచింగ్ సెంటర్లను తనిఖీ చేయాలంటూ 2023లో ఢిల్లీ హైకోర్టు అగ్నిమాపక శాఖను ఆదేశించడాన్ని సవాలు చేస్తూ కోచింగ్ సెంటర్ల అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా ధర్మాసనం పరిశీలించింది. ఇది పసలేని పిటిషన్ అని పేర్కొంటూ రూ.లక్ష జరిమానా విధించింది.


నేలకు ఒరిగింది



గోదారి గట్టుంది.. గట్టు మీన సెట్టుంది.' అంటూ అక్కినేని,సావిత్రి జంటగా నటించిన మూగ మనసులు' (1964) చిత్రంలో జమున పాడిన పాట మీకు గుర్తుంది కదూ. ఆ పాట ఎక్కడ తీశారో తెలుసా? తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఏటిగట్టుపై ఉన్న చెట్టు, పరిసర ప్రాంతాల్లో. అప్పటినుంచి దశాబ్దాలుగా ఈ వృక్షరాజం నీడన ఎన్నో చిత్రాల షూటింగ్స్ జరిగాయి. హీరో కృష్ణ నటించిన 'పాడిపంటలు', చిత్రంలో 'ఇరుసులేని బండి.. ఈశ్వరుని బండి' పాటలోనూ ఈ చెట్టు ప్రముఖంగా కనిపిస్తుంది. అక్కినేని నటించిన 'సీతారామయ్య గారి మనవరాలు' చిత్రంలో 'సమయానికి తగు మాటలాడి' పాటను కూడా ఈ చెట్టు దగ్గరే చిత్రీకరించారు. కళాతపస్వి విశ్వనాథ్ రూపొందించిన 'శంకరాభరణం' నుంచి లేటెస్ట్‌గా రామ్‌చరణ్ హీరోగా నటించిన 'రంగస్థలం' చిత్రం వరకూ మొత్తం 108 చిత్రాల్లోనూ కనిపించి, తనదైన పాత్ర పోషించింది. అగ్ర దర్శకులు, దాసరి, కె.రాఘవేంద్రరావు, జంధ్యాల, ఈవీవీ.. ఈ చెట్టు చుట్టూ తిరిగిన వారే. తమ సినిమాల్లో ఒక్క సీన్ అన్నా అక్కడ తీసేవారు. ఇక దర్శకుడు వంశీ సంగతి చెప్పనక్కర్లేదు. మొత్తం 18 చిత్రాల షూటింగ్స్‌ను ఆయన ఈ చెట్టు దగ్గరే తీశారు. ఈ ప్రాంతానికి వస్తే వంశీ తన మిత్రులతో కలిసి ఈ చెట్టు కింద కూర్చుని భోజనం కూడా చేసేవారని గ్రామస్తులు చెబుతున్నారు. అలా కాలక్రమంలో ఈ చెట్టుకు 'సినిమా చెట్టు' అనే పేరు వచ్చింది. ఈ చెట్టు వద్ద సినిమాలో ఒక్క షాట్ తీసినా సినిమా హిట్ అవుతుందనే నమ్మకం సినీ పరిశ్రమలో ఉంది అందుకే అగ్ర హీరోలు, దర్శకులు ఇక్కడి వచ్చి తమ సినిమాల్లో ఏదో ఒక సన్నివేశంలో 'సినిమా చెట్టు' కనిపించాలని ప్లాన్ చేసేవారు. మధ్యాహ్నం వేళలో ఈ చెట్టు కొమ్మలకు ఊయల కట్టి ఊగుతుంటే కింద గలగల పారే గోదావరి, చుట్టూ ప్రశాంత వాతావరణం... తన్మయత్వంతో శరీరం పులకరించిపోతుంది.

ఇంత చరిత్ర కలిగిన ఈ చెట్టు ఇప్పుడు నేలకొరిగింది. గోదావరి వరదలు, అధిక వర్షాలకు చెట్టు రెండుగా చీలి నేలకూలింది. గోదావరి వరద ఉధృతి వల్ల సినిమా చెట్టుకు ప్రమాదం పొంచి ఉందని, రక్షణ వలయం ఏర్పాటు చేసి పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు ఎన్నో సార్లు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోలేదు. చివరకు అందరూ ఊహించినట్టుగానే జరిగింది. సోమవారం తెల్లవారుజామున సినిమా చెట్టు నేలకు ఒరిగిపోయింది.

నూట యాభై సంవత్సరాల చరిత్ర




ఈ సినిమా చెట్టు చరిత్ర, సెంటిమెంటు మాటల్లో చెప్పలేనిది. 150 సంవత్సరాల కిందట గ్రామానికి చెందిన శింగులూరి తాతబ్బాయి అనే వ్యక్తి నిద్ర గన్నేరు చెట్టు (సినిమా చెట్టు) నాటినట్టు స్థానికుల కథనం. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ చెట్టును కుమారదేవం గ్రామ ప్రజలు సంరక్షించుకుంటూ వస్తున్నారు. గోదావరి వరదలు వచ్చినప్పుడల్లా ఏటిగట్టు కోతకు గురవుతుంది. ఆ కోత చెట్టుకు ముప్పుగా మారింది. గత జూలై నెల 19వ తేదీ నుంచి గోదావరి నదికి వచ్చిన వరదలు, అధిక వర్షాలకు ఏటిగట్టు నానిపోయి ఉంది. దీంతో సోమవారం తెల్లవారుజామున సినిమా చెట్టు రెండు ముక్కలుగా వీడి కూలిపోయింది. ఇది నిద్ర గన్నేరు చెట్టు అయినప్పటికీ దీని కొమ్మలు గోదావరిలోకి పెరిగి ఉంటాయి. గోదావరి వరద పోటు, అధిక వర్షాలవల్లే ఈ చెట్టు కూలిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సినిమావాళ్లకు సెంటిమెంటుగా మారి గ్రామానికి పేరు తెచ్చిన ఈ చెట్టును కాపాడుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్నో వరదల్ని, తుఫానుల్ని తట్టుకుని తరతరాలను చూసుకుంటూ కుమారదేవం గ్రామానికి ఎంతో గుర్తింపు తెచ్చిన ఈ సినిమా చెట్టు కూలిపోవడం ప్రకృతి ప్రేమికులను, గ్రామస్థులను ఆవేదనకు గురిచేస్తోంది.

కొవ్వూరు, (ఆంధ్రజ్యోతి)

సీఎంగా ఉన్నప్పటి భద్రత ఇవ్వండి

- వ్యక్తిగత రక్షణ అధికారులను ఇవ్వాలి..

హైకోర్టులో వైఎస్ జగన్ పిటిషన్



అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హోదాలో తనకు గతంలో ఉన్న భద్రతను పునరుద్ధరించాలని.. ఈ మేరకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తనకు పర్సనల్ సెక్యూరిటీ అధికారులు(పీఎస్‌వోలు), కౌంటర్ అసాల్ట్ టీములు, జామర్‌ను ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి హోదాలో కేంద్ర ప్రభుత్వం తనకు కల్పించిన జడ్ ప్లస్ సెక్యూరిటీని ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తగ్గించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు. కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర హోం శాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, నిఘా విభాగం ఐజీ, గుంటూరు ఎస్పీ, రాష్ట్ర స్థాయి సెక్యూరిటీ రివ్యూ కమిటీని తన పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు. '2019లో విశాఖ ఎయిర్ పోర్టులో నాపై కోడికత్తితో దాడి జరిగింది. రాష్ట్ర రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ముఖ్యమంత్రి కాక ముందే నాకు ఉన్నత స్థాయి భద్రత కల్పించారు. నేను సీఎం అయ్యాక జడ్ ప్లస్ కేటగిరీ కింద 139 మందితో రక్షణ కల్పించారు. 2024 ఎన్నికల ఫలితాలు ప్రకటించి నెల గడవకముందే నాకున్న భద్రతా సిబ్బంది సంఖ్యను 59కి తగ్గించారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా రక్షణ తగ్గించడం సహజ న్యాయసూత్రాలను ఉల్లంఘించడమే. ఎన్నికల ప్రచారంలో నాపై రాయితో దాడి చేశారు. ఈ వ్యవహారంలో సంబంధిత వ్యక్తిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నా ఇల్లు, కార్యాలయం వద్ద భద్రతను పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం నాకు ఇద్దరు పీఎస్‌వోలు మాత్రమే ఉన్నారు. చాలా మంది ఎమ్మెల్యేలకు నాకంటే ఎక్కువ మంది పీఎస్‌వోలను ఇచ్చారు. పోలీసులు నాకిచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా ప్రయాణానికి అనుకూలంగా లేదు. అందులో ఏసీ పనిచేయడం లేదు. ఈ కారణంగా ఇటీవల ఓ పర్యటనను అర్థాంతరంగా రద్దు చేసుకోవలసి వచ్చింది. నన్ను భౌతికంగా లేకుండా చేస్తామని అధికార కూటమి నేతలు ప్రకటనలు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను కోర్టు ముందు ఉంచుతున్నాను. సీఎం హోదాలో నాకున్న జడ్ ప్లస్ భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ జూన్ 7న కేంద్ర హోం శాఖకు వినతి సమర్పించాం. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని జూన్ 3 వరకు నాకున్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలివ్వండి' అని జగన్ పిటిషన్‌లో కోరారు.

మూఢాలు పోయాయి... పెళ్లి ముహూర్తాలు వచ్చేశాయి

- రేపటి నుంచి 28 వరకూ...
- 11, 18 తేదీల్లోనే అత్యధిక పెళ్లిళ్లు

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పరస్పరం నచ్చేసి.. నిశ్చితార్థం కూడా జరిగిపోయి పెళ్లి కోసం ఎదురు చూస్తున్న అమ్మాయి, అబ్బాయిల కోసం శుభ ముహూర్తాలు వచ్చేశాయ్! ఆ ఇళ్లలో ఇక పెళ్లి బాజాలు మోగనున్నాయి. ముహూర్తాల కోసం వెళితే.. 'శుభ శ్రావణ మాసం.. శుభస్య శీఘ్రం' అంటూ పంతులు గారు మంచి రోజు నిర్ణయించేస్తారు! ఈ నెల.. అంటే ఆగస్టు 7 నుంచి 28 వరకు పెళ్లి ముహూర్తాలున్నాయి. పైగా మూడు నెలల తర్వాత వచ్చిన శుభ ఘడియలు! ఇవి తప్పిపోతే.. మళ్లీ అక్టోబరు 13 దాకా ముహూర్తాలే లేవు. దీంతో 7-28 తేదీల మధ్య తెలుగు రాష్ట్రాల్లో వేల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. ఆగస్టు 7న శుభ ముహూర్తాలు మొదలవనుండగా.. పెళ్లిళ్లు మాత్రం 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28 తేదీల్లో జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 26న చైత్ర మాసంతో పాటు శుక్ర, గురు మూఢాలు మొదలయ్యాయి. తర్వాత వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ (మే, జూన్, జూలై)మాసాలు కావడంతో ముహూర్తాలు లేవు. అంటే.. ఈ ఏడాది ఏప్రిల్ 26 నుంచి వివాహాలకు అనువైన ముహూర్తాలు లేకపోవడంతో తెలుగు రాష్ట్రాల్లోని ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్ వ్యాపారులకు పెద్దగా వ్యాపారం లేకుండా పోయింది. ఇప్పుడైతే ఇప్పటికే పెళ్లిళ్లు కుదుర్చుకున్న వారంతా ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్స్ బుక్ చేసుకున్నారని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. అయితే అక్టోబరు 13 దాకా ఆగితే అక్కడి నుంచి వచ్చే ఉగాది దాకా పెళ్లి ముహూర్తాలే ఉన్నాయి. కాగా ప్రస్తుతం ఆగస్టులో దాదాపు 10 రోజుల పాటు మంచి ముహూర్తాలున్నా.. వాటిలో 11, 18 తేదీల్లో వివాహాలు ఎక్కువగా జరగనున్నాయి. 11వ తేదీ ఆదివారం, స్వాతి నక్షత్రం, సప్తమి రావడంతో ఇది చాలా విశేషమైన రోజుగా పరిగణిస్తారు. 18వ తేదీ కూడా ఆదివారం, శ్రవణ నక్షత్రం, చతుర్థశితో పాటు పౌర్ణమి రావడంతో విశిష్టమైన రోజుగా పండితులు చెబుతుండడంతో ఈ రోజున ఉండే ముహూర్తానికి కూడా మరింత డిమాండ్ ఉంది. అయితే ఈనెల 9న, ఆగస్టు 28న కూడా పెళ్లిళ్లు అధికంగా జరగనున్నాయి.

గిరిజన గ్రామాలకు మహర్దశ

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

హరిపురం: కూటమి ప్రభుత్వంతో గిరిజన గ్రామాలకు మహర్దశ లభించనుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం సాబకోట పంచాయతీ బల్యాసాయి గ్రామానికి రూ.40 లక్షలతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లకు కనీసం మరమ్మతులు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంవచ్చిన 50 రోజుల్లోనే రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేస్తున్నా మన్నారు. మండలంలో మరో రూ.10 కోట్లతో వివిధ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రాధాన్యతా పరంగా రోడ్లు, తాగు, సాగు నీరు, విద్య తదితర సదుపాయాల కల్పనకు మొదటి ప్రాదాన్యం ఇస్తున్నామ న్నారు. ఐటీడీఏను మందసలో ఏర్పాటు చేయాలని స్థానిక గిరిజన యువత కోరారు. కార్యక్రమంలో ఏఈ వి.శ్రీని వాసరావు, టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, మండల లచ్చయ్య, బమ్మిడి కర్రయ్య, రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రుల దృష్టికి నియోజకవర్గ సమస్యలు



రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన మంత్రి రామ్మోహన్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడులను కలిసి వినతిపత్రాలను అందించారు. నరసన్నపేట పట్టణాభివృద్ధి, శ్రీములింగేశ్వర దేవస్థానంలో అన్నప్రసాదం ఏర్పాటు, డోల-నౌపడ రోడ్డును విస్తరించి కోస్టల్ కారిడార్‌ను అనుసంధానం చేయాలని రామ్మోహన్‌ను కోరారు. నియోజవర్గం ముఖ్య కేంద్రమైన నరసన్నపేటను అనుసంధానం చేస్తూ తిలారు రైల్వే స్టేషన్‌కు అమృత్ భారత్‌లో నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించాలని, ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయాలని, ఉర్లాం రైల్వేస్టేషన్ అభివృద్ధి చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కేంద్ర రంగ సంస్థలను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులను కోరినట్లు ఎమ్మెల్యే బగ్గు తెలిపారు. ఈమేరకు నరసన్నపేట నియోజవర్గంలో కేంద్రప్రభుత్వ సంస్థలను నెలకొల్పేందుకు తన వంతు కృషి చేస్తానని రామ్మోహన్‌నాయుడు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు.

కూటమి ప్రభుత్వంతో విద్యాభివృద్ధి

● పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు

కొత్తూరు/హిరమండలం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతో విద్యారంగ అభివృద్ధి సాధ్యపడుతోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కొత్తూరు, హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో సోమవారం పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కొత్తూరు ఉన్నత పాఠశాలలో బెంచీలు లేక అవస్థలు పడుతున్నామని విద్యార్థులు వినతిపత్రం అందించగా, తన జీతంలో రూ.లక్ష కేటాయించి బెంచీలు ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ నిచ్చారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ బుచ్చి బాబు, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాద్, నేతలు ఆగతముడి అరుణ్, మాధవరావు, మాతల గాంధీ, చింతాడ కోటేశ్వరరావు, యాళ్ల నాగేశ్వరరావు, టి.తిరుపతిరావు, లాడె కృష్ణ, ప్రిన్సిపాళ్లు బండారు రవికుమార్, పీవీఎస్ పట్నాయక్, ఎంపీడీవో స్వరూపరాణి, తహసీల్దార్ బి.వెంకటరమణ, ఎంఈఓ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో కీలకపాత్ర

ఎల్.ఎన్.పేట: సమాజాభివృద్ధిలో విద్యారంగానిది కీలకపాత్ర అని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే దిశలో ప్రభుత్వం ఆర్థికంగా చేయూత ఇవ్వడమే కాకుండా పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందిస్తోందన్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో అర్హులైన అధ్యాపకుల ద్వారా విద్యను అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తహసీల్దార్ వైవీ పద్మావతి, ఎంపీడీవో జీగిరి బాల, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, టీడీపీ మండల నాయకులు వి.గోవిందరావు, కె.కృష్ణమాచారి, వి.ఆనందరావు, కె.మన్మథరావు, ఎస్.తేజేశ్వరరావు, ఎం.మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ● **పాతపట్నం:** విద్య, వైద్య రంగాలకు ప్రథమ ప్రాధా న్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం పాఠ్య పుస్తకాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పైల బాబ్జీ, సైలాడ సతీష్ సర్పంచ్ ప్రతినిధి సిర్ల జోగారావు, కళాశాల ప్రిన్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

నెల జీతం ప్రజలకే..

కొత్తూరు: తన నెల పూర్తి జీతాన్ని నియోజకవర్గ ప్రజలకే అందించనున్నట్టు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. ప్రతి నెలా మొదటి వారంలో సమస్యలపై ప్రజాదర్బార్ నిర్వహిస్తానని, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, పాతపట్నం, మెళియా పుట్టి మండలాల ప్రజా వినతులను సమీక్షించి మండలానికి ఐదుగురు చొప్పున ఐదు మండలాలకు 25 మందికి నెల జీతాన్ని వారి సమస్యల పరిష్కారానికి అందజేయనున్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు.



హిరమండలం: విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

శ్రీముఖలింగంలో శివస్వాముల సందడి



శ్రీముఖలింగం చేరుకున్న శివభక్తులు

జలుమూరు: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో శివస్వాములు సందడి మొదలైంది. ఒడిశా రాష్ట్రం రాయగడ, పర్లాకిమిడి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు 45 రోజుల పాటు శివదీక్ష చేపట్టి అనంతరం శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకొని దీక్షను విరమిస్తారు. ఈ మేరకు దీక్ష విరమణకు సోమవారం శ్రీముఖలింగం చేరుకొని వంశధార నదిలో స్నానమాచరించి నది ఒడ్డున ఇసుకతో శివలింగం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. నదీ జలాలను చెంబుతో కావిడలో నింపి ఆ నీటితో శ్రీముఖలింగేశ్వరునికి అభిషేకం చేశారు. అలాగే కాలినడకన శ్రీముఖలింగం నుంచి రావివలస చేరుకొని ఎండల మల్లికార్జునుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీముఖలింగేశ్వరుని గోలెంకు ఇత్తడి కవచం



జలుమూరు: శ్రీముఖలింగేశ్వరస్వామి గర్భగుడిలో వెనుక భాగంలో ఉన్న గోలేనికి విజయనగరానికి చెందిన ఎడ్ల పైడిరాజు సోమవారం ఇత్తడి కవచం బహూకరించారు. ఆయన పేరుతో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గోలేనికి ఇత్తడి తొడుగు తొడిగి నిండుగా బియ్యం పోసి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు నారాయణమూర్తి, సింహాచలం, ఎస్.వెంకటాచలం పైడిరాజు కుటుంబాన్ని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, సర్పంచ్ టి.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో కుష్టువ్యాధి నిర్మూలన

నరసన్నపేట: అవగాహనతో కుష్టువ్యాధిని నిర్మూలించవచ్చని అడిషనల్ డీఎంహెచ్‌వో డా. తాడేల శ్రీకాంత్ అన్నారు. సోమవారం మాకివలస, ఉర్లాం పీహెచ్‌సీలను పరిశీలించారు. గ్రామాల్లో చేపడుతున్న ఏసీడీసీ సర్వే ద్వారా 83 కేసులు గుర్తించి వారికి చికిత్స అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్, వైద్యులు గొలివి సుజాత, శిరీష, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎండల మల్లన్న, సంతోషిమాత ఆలయాల హుండీల లెక్కింపు

టెక్కలి: రావివలస ఎండలమల్లికార్జున స్వామి ఆలయం హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈవో వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. దేవ దాయశాఖ అధికారులు, గ్రామస్థుల సమక్షంలో హుండీ తెరవనున్నట్లు తెలిపారు. అలాగే సంతోషి మాత అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈవో పీపీ మనస్విని ఒక ప్రకటనలో తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

పలాస: స్థానిక లలితా ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు సోమవారం అనాథ మృతదేహానికి అంత్య క్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇక్కడ నిర్వహిస్తున్న అనాథ ఆశ్రమంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సంస్థ నిర్వాహకుడు ఎస్.చిన్నికృష్ణ, ఉద్యోగి సాయి సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇప్పటి వరకు సుమారు 600 అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించినట్లు వారు తెలిపారు. అనాథలు మరణిస్తే తమకు సమాచారం అందించాలని, వాటి అంత్యక్రియలను తామే ఉచితంగా చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యురాలు

నందిగాం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరి సరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నందిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అనితకుమారి అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో కాపుతెంబూరులో జ్వరాలపై వచ్చిన కథనానికి ఉన్నతాధికారు లు స్పందించారు. వారి ఆదేశాల మేరకు సోమవారం వైద్యాధికారి నేతృత్వంలో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పాఠశాల ఆవరణలో 50 మందికి వైద్యపరీక్షలు చేసి జ్వరపీడితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిం చారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ధాతారాం, హెల్త్ అసిస్టెంట్ ఫల్గుణరావు, ఎంఎల్‌హెచ్‌పీ మురళి తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ డీఎస్పీగా శ్రీనివాసరావు



పలాస, ఆగస్టు 5: కాశీబుగ్గ డీఎస్పీగా పి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అమరావతి పోలీసు కేంద్ర కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈయన గతంలో కాశీబుగ్గ ఎస్ఐ, సీఐగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తామని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుం డా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం డీఎస్పీగా బాధ్య తలు స్వీకరించిన శ్రీనివాసరావుకు డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

టీడీపీ సీనియర్ నాయకుడు భాస్కరరావు మృతి



భాస్కరరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సుగుణ

నరసన్నపేట: టీడీపీ సీనియర్ నాయకుడు, భవన నిర్మాణ కార్మికుల సంఘ మాజీ అధ్యక్షుడు చింతు భాస్కరరావు (65) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడిగా, కార్యవర్గ సభ్యులుగా పదవులను నిర్వహించారు. భాస్కరరావు మృతి పట్ల ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రగాఢ సానుభూతి తెలిపారు. టీడీపీ నియోజవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు బగ్గు సుగుణ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ప్రతిభ కనబరిచిన ఇంటర్ విద్యార్థులకు పురస్కారం

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పారిశెల్లి రామరాజు ఆధ్వర్యంలో నగదు పురస్కారాలను సోమవారం అందజేశారు. ప్రిన్సిపాల్ బి.రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గోవిందరావు ఈ పురస్కారాలను అందించి అభినందించారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి

జలుమూరు: మా గ్రామంలోని వెలమల వీధి, చాకలి వీధుల్లో తాగునీటి సదుపాయం కల్పించాలని యలమంచిలి గ్రామానికి చెందిన మహిళలు కోరారు. అచ్యుతాపురం తాగునీటి ప్రాజెక్టు నుంచి గ్రామానికి తాగునీటిని అందిస్తున్నారని, అయితే గ్రామంలో అన్ని వీధుల్లో పైప్‌లైన్ వేసి ఈ రెండు వీధులకు లైన్ వేయలేదన్నారు. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, తగు చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళలు కోరుతున్నారు.

ఉద్యమ పత్రిక ఆవిష్కరణ

జలుమూరు (సారవకోట): జలుమూరు మండలం ఎస్టీ మాకివలస ఆదివాసీల భూములు సమస్య పరిష్కారం కోసం ఈనెల 12న నిర్వహించనున్న నిరసనకు సంబంధించిన ఉద్యమ పత్రికను సోమవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాకివలస గిరిజనులకు న్యాయం కోసం జిల్లాలోని ఆదివాసీలకు పౌర, ప్రజాస్వామిక వాదులు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ జిల్లా నాయకులు పాపారావు, సూరపునాయుడు, హరీష్, శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధిత చిన్నారికి 'అభయం' చేయూత

టెక్కలి: గార మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన డి.లక్ష్మీనారాయణ, సాయమ్మ దంపతుల మూడేళ్ల చిన్నారి కారుణ్య బ్లడ్ కేన్సర్‌కు గురికావడంతో ఆ చిన్నారి వైద్యానికి టెక్కలికి చెందిన అభయం యువజన సేవా సంఘం రూ.55 వేలు సహాయాన్ని సోమవారం అందించింది. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి కుటుంబ సభ్యులకు ఈ మొత్తం అందజేశారు. కార్యక్ర మంలో సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దేవాది శ్రీనివాసరావు, లాడి కామేశ్వరరావు, శ్రీనివాస్ బెహరా, అందవరపు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

పాతపట్నం: స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.రామకృష్ణరాజు తెలిపారు. 2023- 24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులు, సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీపై ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీలపై ప్రజా వేదికలో ప్రకటిస్తారన్నారు.

ప్రజా వినతులకు విశేష స్పందన



ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజల నుంచి 118 ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలించిన కలెక్టర్ 11 వినతులను అక్కడకక్కడే పరిష్కరించి మిగతా వినతులు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వాతి ఎస్‌కుమార్, జడ్పీ సీఈవో గుణనిధి నాయక్ పాల్గొన్నారు.

బాబా మందిరానికి దివ్యపథం వితరణ

ఒడిశా

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి చత్రపురం గ్రామంలోని సత్యసాయిబాబా మందిరా నికి పాతపట్నంకు చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రామరాజు దివ్యపథం (వెల్వెట్ క్లాత్) సోమవారం అందజేశారు. కార్యక్రమంలో గుసాని సమితి అధ్యక్షుడు ఎన్.వీర్రాజు, సర్పంచ్ ఝాన్సి సత్యసాయి సేవా సమితి కన్వీనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి కిడిగాం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి సోమవారం ఆవిష్కరించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతి, సమితి అధ్యక్షురాలు సాయమ్మ, లోకనాథం, రాజ్యలక్ష్మి, సర్పంచ్ తేజ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల పథకాలపై అవగాహన అవసరం

జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజాచక్రవర్తి

టెక్కలి: మానసిక దివ్యాంగులు కోసం అమలు చేస్తున్న పథకాలపై వారి తల్లిదండ్రులు, సంరక్ష కులు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజా చక్రవర్తి అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో మానసిక దివ్యాంగుల తల్లిదండ్రులు, సంరక్షకులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ పౌరులతో పాటు మానసిక దివ్యాంగులకు కూడా రాజ్యాంగంలో సమానహక్కులు కల్పించబడ్డాయన్నారు. వారిని మానసిక వైద్యశాలల్లో చేర్పించి సరైన సౌకర్యాలు అందించాలని సూచించారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, ఎంఈవోలు డి.తులసీరావు, బి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌కు వితంతువులు నమోదు చేసుకోవాలి

పలాసరూరల్: అర్హులైన వితంతువులు పింఛన్ పొందేందుకు పేర్లను నమోదు చేసుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి యు.మాధురి అన్నారు. పలాస ఎంపీడీవో కార్యాలయంలో హైకోర్టు చీఫ్ జస్టిస్, ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ ఆదేశాల మేరకు సోమవారం పలాస, వజ్రపుకొత్తూరునకు చెందిన వితంతు మహిళలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత ఉండి వితంతు పింఛన్ అందని వారు మరలా నమోదు చేసుకోవాలని, పెన్షన్ పొందే అంశాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు మెట్ట వైకుంఠరావు, డి.తిరుమలరావు, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అనిల్‌రాజ్, న్యాయవాదులు పాల్గొన్నారు.





టెక్కలి, పలాసల్లో మాట్లాడుతున్న జూనియర్ న్యాయాధికారులు తేజాచక్రవర్తి, మాధురి

జాతీయ పోటీలకు రామ్మోహన్ ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన రామ్మోహన్‌రావు

పలాస: అఖిలభారత ప్రజారవాణా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఆలిండియా అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక ఆర్టీసీ డిపోలో సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తున్న గురుగుబెల్లి రామ్మోహనరావు ఎంపికయ్యారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో 100, 1000 మీటర్ల ఫాస్ట్‌వాక్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. సెప్టెంబరులో జరగనున్న జాతీయ పోటీలకు ఆయన ఎంపికైనట్లు ఆర్టీసీ అధికారుల నుంచి వర్తమానం అందింది. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావును డీఎం ఆర్.సీతారామ్ నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ పి.సంతోష్‌కుమార్, యూనియన్ నాయకులు అభినందించారు.

ఆకాశవాణిలో దేశభక్తిపై ప్రసంగం



ప్రసంగిస్తున్న కూర్మారావు

పలాసరూరల్: పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన గిడుగు రామమూర్తి జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు సోమవారం ఆకాశవాణి కేంద్రంలో 'స్వాతంత్ర్య ఉద్యమంలో దేశభక్తి గేయాలు, సమాజంపై వాటి ప్రభా వం' అనే అంశంపై ప్రసం గించారు. వివిధ కళా రూపాలతో తనకున్న అనుబంధం ద్వారా ఈ అవ కాశం వచ్చిందని, దేశభక్తి గేయాలపై వివరించడం ఆనందం ఉందని ఆయన తెలిపారు. కాగా ఈ దేశభక్తి గేయాలపై ఆకాశవాణిలో ఈనెల 13న ప్రసారం అవుతుందన్నారు.

జీవో 77 రద్దు చేయాలని ఏబీవీపీ వినతి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

టెక్కలి: జీవో 77ని రద్దు చేయాలని ఏబీవీపీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.మురళి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ కేజీ టు పీజీ ఉచిత విద్య అని చెప్పి పీజీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వకుండా జీవోనెం.77 అమలుచేసి విద్యార్థులను మోసం చేశారని విమర్శించారు. ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ జీవోను రద్దు చేస్తామని మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిల బెట్టుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీవో సుదర్శన దొరకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిగిలపల్లి మదన్ కుమార్, విశ్వనాథ్, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై మొగ్గుచూపాలి

టెక్కలి: రైతులు ఆధునిక వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని వ్యవసాయశాఖ ఏడీ బీవీ తిరుమలరావు అన్నారు. సోమవారం గూడేం ప్రాంతంలో పొలంబడి క్షేత్రాన్ని పరిశీలించారు. వరుస క్రమంలో నాట్లు వేయడం వల్ల లాభసాటిగా ఉంటుందని, గాలి, వెలుతురు తగలడంతో చీడపీడలు తగ్గి పిలకలు బాగా పెరిగి దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో రంగారావు, వ్యవసాయ విస్తరణాధికారి నరేంద్ర, జనార్దన్ పాల్గొన్నారు.

కాలిబాటలతో ప్రయోజనం

చొర్లంగి(ఎల్.ఎన్.పేట): వరిని సాగుచేసే పొలాల్లో కాలిబాటలు తీయడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని వ్యవసాయాధికారి పి.లత్శ్రీ తెలిపారు. చొర్లంగి గ్రామంలో సోమవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలిబాటల వల్ల పంటను ఆశించే సుడిదోమను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కృషి: ఎంజీఆర్

పాతపట్నం: మహిళల సంక్షేమానికి పాటుపడతామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బీసీ సామాజిక భవనంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పౌష్టికాహార ప్రదర్శనలను చేపట్టిన మహిళలను అభినందించారు. గర్భిణులకు నిర్వహించిన శ్రీమంతాల్లో వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీమంతం చేసుకున్న ప్రతి మహిళా తన బిడ్డతో క్షేమంగా ఇంటికి చేరుకునే బాధ్యతను తీసుకుంటానన్నారు. సీఎం చంద్రబాబు మహిళా పక్షపాతి అని, వారి సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. పలువురు ఐసీడీఎస్ అధికారులు, టీడీపీ నేతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

నందిగాం: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని టెక్కలి ఐసీడీఎస్ సీడీపీవో పి.శోభారాణి అన్నారు. దేవళభద్రలో నందిగాం-1 సెక్టార్ స్థాయి తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యకరంగా పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తుందన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వ హించారు. నందిగాం-2 సెక్టార్ స్థాయిలో చెరుకుపల్లిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ నాగమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జలజాక్షి, శారదాభాయి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు ఆరోగ్యం

పలాసరూరల్: బొడ్డపాడు గ్రామంలో సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ దానమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహిం చారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ చేపట్టి తల్లిపాల ఆవశ్యకతపై వివరిం చారు. బిడ్డపుట్టిన గంటలోపు ముర్రుపాలు అందించాలని, తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు ఊహ, ఆశా వర్కర్లు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.





పలాస రూరల్: బొడ్డపాడు, పోలాకి: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



కోమర్తిలో సామూహిక శ్రీమంతాలు



నందిగాం: మాట్లాడుతున్న సీడీపీవో శోభారాణి

అమృతం కన్నా గొప్పది అమ్మ

నరసన్నపేట: అమృతం కన్నా అమ్మదనం ఎంతో గొప్పదని ఐసీడీఎస్ అధికారి రమణమ్మ అన్నారు. సోమవారం కోమర్తి గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సామూహిక శ్రీమంతాలను నిర్వహించారు. తల్లి ఆరోగ్యం ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని, శిశువుకు తల్లిపాలు అమృతంలా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిమ్మ జగన్నాథం, సూర్యనారాయణ, ముద్దాడ అప్పలనాయుడు, పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహనా ర్యాలీ

పోలాకి: తల్లిపాల ఆవశ్యకతపై పోలాకి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రుంకు జగన్నాథపురంలో పోలాకి కేంద్రం నిర్వాహకు రాలు డోల సరోజిని ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ శ్రీదేవి పర్యవేక్షణలో ప్లకార్డుల ద్వారా అవగాహన కల్పించారు. తల్లిపాల ద్వారా చిన్నారుల మెదడు వికసిస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా, ఉపాధ్యాయులు, మహిళా స్వయం శక్తి సంఘాల లీడర్లు, కార్యకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


యశ్వంత్(ఫైల్)

ఎచ్చెర్ల: మండల కాంప్లెక్స్ జంక్షన్ వద్ద పాత జాతీయ రహదారిపై సోమవారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలకపాలెం గ్రామానికి చెందిన డొంక యశ్వంత్‌కుమార్ (32) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లారీలను, టిప్పర్లను అద్దెకు ఇస్తూ ఈయన జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం వేకువ జామున కాంప్లెక్స్ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో కొంత సమయం అలాగే ఉండిపోయాడు. యశ్వంత్ ఎంతసేపటికీ రాకపోవడంతో తోటి లారీ నిర్వాహకులు రోడ్డుపైకి వచ్చి చూడగా.. కొనఊపిరితో రక్తపుమడుగులో పడి ఉన్నాడు. వెంటనే వారు చికిత్స నిమిత్తం తొలుత శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. యశ్వంత్‌కు రెండేళ్ల క్రితమే వివాహం కాగా.. అతడి భార్య ప్రస్తుతం గర్భిణీ. అందరితోనూ కలుపుగోలుగా ఉంటూ.. అందరికీ సాయపడే యశ్వంత్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

పతివాడపాలెం జంక్షన్ వద్ద ఒకరు..

రణస్థలం: జాతీయరహదారి పతివాడపాలెం జంక్షన్ వద్ద సోమవారం తెల్లవారి జామున గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 45ఏళ్ల వయసు కలిగిన వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో మృతదేహం నుజ్జునుజ్జు అయింది. మృతి చెందిన వ్యక్తి ఎవరనేది గుర్తించలేని విధంగా మృతదేహం నుజ్జయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు జేఆర్ పురం ఎస్ఐ గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గిరిజన యువకుడు..


కామేష్ మృతదేహం

హరిపురం: మందస మండలం సవర రాజపురం గ్రామంలో సోమవారం విద్యుదాఘాతానికి గురై గిరిజన యువకుడు సవర కామేష్(32) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భావనాపురం గ్రామానికి చెందిన కామేష్ రేషన్ సరుకులు తీసుకొనేందుకు సవరరాజపురం వెళ్లాడు. ఆ సమయంలో తూకానికి ఉపయోగించే కాటా (వేయింగ్ మిషన్) చార్జింగ్ అయిపోవడంతో గ్రామంలోని ఒక ఇంటి వద్ద చార్జింగ్ పెట్టాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గుర్తించి హుటాహుటిన హరిపురం సీహెచ్‌సీకి తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మందస ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు


నుజ్జునుజ్జయిన కారు

కోటబొమ్మాళి: మండలం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం గారబంద నుంచి నిమ్మాడ వెళుతున్న కారు జాతీయ రహదారి కొత్తపేటకు సమీపంలో అదుపు తప్పి నరసన్నపేట వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు బెలూన్లు ఓపెన్ కావడంతో యజమాని సురక్షితంగా బయట పడగా.. డ్రైవర్ ముఖేష్ తలకు గాయాలయ్యాయి. కారులో ఉన్న మరో వ్యక్తి సాయం తో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్సను అందించారు. అలాగే కోటబొమ్మాళి పెద్దచెరువు సమీపంలో సంతబొమ్మాళి మండలం ఆకుల సత్యవరం గ్రామానికి చెందిన వై.నీలకంఠం, బృందావనం గ్రామానికి చెందిన బి.ప్రసాద్ ద్విచక్రవాహనంపై వస్తుండగా అదే మార్గంలో వస్తున్న తర్లిపేట గ్రామానికి చెందిన టి.సింహాచలం, జి.కృష్ణారావు ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి ఢీకొట్టడంతో వారికి గాయాలయ్యాయి. వీరందరికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల ఘర్షణపై విచారణ

పొందూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారంరోజుల కిందట విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణపై డిప్యూటీ డీఈవో విజయలక్ష్మి సోమవారం విచారణ చేపట్టారు. ఈ ఘటనలో విద్యార్థి ధనుంజయ చేయి విరిగింది. దీంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. విద్యార్థులు, వారితల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆమె విచారించారు. ఈ విషయంలో హెచ్ఎం పి.వెంకటరావు స్పందించక పోవడంపై డీవైఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎం తీరుపై బాధిత విద్యార్థి తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని డిప్యూటీ డీఈవో తెలిపారు. హెచ్ఎం సెలవుపై వెళ్లడంపై ఆమె స్పందించారు. ఎస్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో ఎవరికీ సెలవులు మంజూరు చేయడం లేదని, హెచ్ఎం సెలవు దరఖాస్తును ఆమోదించలేదన్నారు. అందువల్ల హెచ్ఎం పాఠశాలకు గైర్హాజరైనట్టు మాత్రమే గుర్తిస్తామని స్పష్టం చేశారు.

టెక్కలిలో దొంగల హల్‌చల్

టెక్కలి: స్థానిక ఇందిరాగాంధీ కూడలిలో ఆదివారం రాత్రి దొంగలు రెండు చోట్ల చోరీకి పాల్పడ్డారు. మహవీర్ ఫొటో స్టూడియో, ఎస్ఎంఆర్ హోటళ్లకు వెనుకవైపు డోర్లు తొలగించి చొరబడ్డారు. ఈ దుకాణాల్లో ఉన్న సీసీ కెమెరాల లైన్లను కట్ చేసి చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. ఆ రెండు చోట్ల క్యాష్ కౌంటర్లలో ఉన్న కొంత మొత్తంలో నగదు తప్ప మరేమీ వారికి లభించలేదు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ప్రధానోపాధ్యాయుడి ఇంట్లో చోరీ

ఇచ్ఛాపురం: పట్టణ పరిధి స్వేచ్ఛానగర్‌లో నివాసముంటున్న మండపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాష్ మాస్టారు పిల్లలు వైజాగ్‌లో చదువుతున్నారు. ప్రతీ వీకెండ్‌లో వారిన చూసేందుకు వైజాగ్ వెళ్లి తిరిగి సోమవారం ఉదయానికి వచ్చేస్తుంటారు. శనివారం రాత్రి వైజాగ్ వెళ్లిన ప్రకాష్ సోమవారం ఉదయానికి ఇంటికి చేరుకున్నారు. తలుపుల తాళాలు తీసి లోపలికి వెళ్లే సరికి వెనుక వైపున ఉన్న కిటికీలను తొలగించి ఉండడం చూసి చోరీ జరిగినట్టు గుర్తించాడు. వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బీరువా పగలగొట్టి వాటిలో ఉన్న బట్టలు, వస్తువులు చెల్లాచెదురుగా పడేశారు. వెంటనే క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఇంట్లో విలువైన వస్తువులు లేకపోవడంతో చిన్న చిన్న వస్తువులతో పాటు కొంత నగదు చోరీ జరిగినట్టు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు

చొర్లంగి శివాలయంలో..

ఎల్ఎన్ పేట: చొర్లంగి గ్రామ శివాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. అర్చకులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రావణమాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు తెల్లవారుజామునే స్వామిని దర్శించుకునేందుకు వస్తారన్న ఉద్దేశంతో ఆలయాన్ని శుభ్ర పరిచేందుకు వెళ్లగా అప్పటికే హుండీ తాళం పగులగొట్టి ఉండడాన్ని అర్చకులు గుర్తించారు. హుండీలోని నగదు చోరీకి గురైనట్టు గుర్తించి స్థానికులకు సమాచారం అందించారు. చోరీ విషయాన్ని తెలుసుకున్న సరుబుజ్జిలి ఎస్ఐ.. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు.

'ఎస్పీ మీ కోసం'లో 50 అర్జీలు


అర్జీలను స్వీకరిస్తున్న ఏఎస్పీ ప్రేమ్ కాజల్

శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఎస్పీ మీకోసంలో ఏఎస్పీ ప్రేమ్ కాజల్ 50ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కుటుంబ తగాదాలపై ఐదు, ఆస్తి తగాదాలపై 12, పౌరసంబంధాలపై ఎనిమిది, చీటింగ్‌పై ఐద, సైబర్ నేరాలపై ఒకటి, పాతకేసులపై నాలుగు, ఇతరిత్ర సమస్యలపై 15 అర్జీలు అందాయి.

ఉదయం ఎండ.. మధ్యాహ్నం వాన

- జిల్లాలో పలు చోట్ల కురిసిన వర్షం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)/ గుజరాతీపేట

బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ మార్పులు కారణంగా జిల్లాలో సోమవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఉదయం తీవ్ర ఉండతో ఇబ్బందిపడిన జిల్లావాసులకు మధ్యాహ్నం కురిసిన వర్షంతో ఉపశమనం కలిగింది. శ్రీకాకుళం నగర గంట పాటు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై మురుగునీరు ప్రవహించింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందిపడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్, ఇలిసిపురం, పాలకొండ రోడ్డు, పాతబస్టాండ్ తదితర లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్చిపోయింది. కాగా జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల వర్షం కురిసింది. అత్యధికంగా కవిటిలో 17.25 మి.మీ. వర్షం కురిసింది. శ్రీకాకుళంలో 14.25, ఆమదాలవలసలో 11.5, ఇచ్ఛాపురంలో 5.75, రణస్థలం 5.25, సంతబొమ్మాళి 3.5, ఎచ్చెర్ల 3.25, పలాసలో 0.75 చొప్పున వర్షపాతం నమోదైంది.


శ్రీకాకుళం నగరంలో జోరుగా కురుస్తున్న వర్షం


వర్షంలో తడుస్తూ..

ప్రైవేటుకు దీటుగా బోధించండి


బూర్జ: పాఠ్య పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి: కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తుందని, ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా సర్కారు బడుల్లో పాఠాలు బోధించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ జూనియర్ కళాశాలల అధ్యాపకులకు పిలుపునిచ్చారు. సోమవారం సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల, రొట్టవలస బాలికల జూనియర్ కళాశాలలో రాష్ట్రం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, బ్యాగ్స్ పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆమదాలవలస మండలం దన్నన్నపేట వద్ద ఉన్న పాండవుల మెట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని టీడీపీ యువత మండల అధ్యక్షుడు తాడేల రాజారావు వినతిపత్రం వినతి పత్రం అందించారు. నాయకులు శివ్వాల సూర్యనారాయణ, నందివాడ గోవిందరావు, కిల్లి సిద్దార్థ, పల్లి సురేష్ అంబళ్ల రాంబాబు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

- **బూర్జ:** విద్యా ప్రమాణాలు మెరుగునకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. నాగావళి నదిలో పడవ ఏర్పాటు చేయాలని కాఖండ్యాం విద్యార్థులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మాజీ జడ్పీటీసీ ఆనెపు రామకృష్ణం నాయుడు, టీడీపీ నాయకులు సత్య ప్రసాద్, శ్రీరామనాయుడు, జగన్నాథం నాయుడు, సీతబాబు, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవోలు ధనుంజయరావు, శ్యాంసుందరరావు, ప్రిన్సిపాల్ తవిటినాయుడు పాల్గొన్నారు.

అరసవల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా


కాలువ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: అరసవల్లిని అన్నివిధాలా ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం ఆయన నగరంలోని అరసవల్లి ప్రాంతంలో నగర కమిషనర్ ఓబులేసుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం సూర్యనారాయణ స్వామివారి దేవాలయం గల అరసవల్లి గ్రామంలో కనీస సౌకర్యాలు కూడా కల్పించలేని స్థితిలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేపడతామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం నా బాధ్యతని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామ పెద్ద పాల్గొన్నారు.

సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలి


సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కలెక్టరేట్: ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని ఇన్‌చార్జి డీఆర్వో ఎం.అప్పారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించి 'మీ కోసం'లో సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 172 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రతీ అర్జీని వ్యక్తిగతంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి, ఏపీసీ జయప్రకాష్, వైద్యారోగ్యశాఖ, డీఆర్డీఏ, డ్వామా, విద్యాశాఖ, విద్యుత్తు, ల్యాండ్ అండ్ సర్వే, పోలీసు, ఉద్యాన తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేధింపులు ఆపకుంటే పోరాటం ఉధృతం చేస్తాం


నిరసన తెలుపుతున్న స్కీం వర్కర్లు, యూనియన్ నాయకులు

కలెక్టరేట్: స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపకుంటే పోరాటం ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగమణి డిమాండ్ చేశారు. అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ప్రధాన గేట్ వద్ద నిరసన తెలిపారు. తొలుత ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్ వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, ఆశ, వీవోఏలు(వెలుగు), ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన వంట కార్మికులు, స్కూల్ స్వీపర్లు తదితర స్కీమ్ వర్కర్లపై కక్షపూరితంగా రాజకీయ వేధింపులు జరుగుతున్నాయని ఆవేనద వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ చోట్ల జరుగుతున్న వేధింపులను వివరించారు. అనంతరం జడ్పీలో నిర్వహించిన 'మీ కోసం'లో డీఆర్వో అప్పారావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అల్లు మహాలక్ష్మి, ఎస్.గణపతి, ఎస్వీ రమణ, కె.సూరయ్య, ప్రకాష్, కె.కల్యాణి, డి.సుధ, డి.ధనలక్ష్మి, జి.అమరావతి, బి.ఉత్తర, శ్రీరామరెడ్డి, సిర్ల ప్రసాద్, పి.లతాదేవి, కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

మెట్టవలసలో పర్యటించిన ఎన్ఈఆర్


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం: డయేరియాతో వణికిపోతున్న మెట్టవలస గ్రామంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) సోమవారం పర్యటించారు. ముందుగా రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామానికి చేరుకొని పరిస్థితిపై ఆరా తీశారు. డయేరియా అదుపులోకి వచ్చేవరకు బాధితులకు అం దుబాటులో ఉండాలని వైద్యులను, సిబ్బంది ఆదేశించారు. నాయకులు కుమరాపు రవికుమార్, కామోజుల సీతారాం, బెవర జగన్నాథరావు, వైద్యాధికారులు యశ్వంత్, సుమబిందు, ఎంపీడీవో వెంకన్నబాబు, ఆర్.రామచంద్రరావు ఉన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం


గణిత అవధానంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సోంపేట: అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని మామిడిపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దు తిరుపతిరావుతో గణిత అవధానం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం రోణంకి అనంతరావు, కుమార్‌నాయక్, శ్రీనివాస్ బాబ్జీ, బత్తిన బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

2,400 హెక్టార్లలో సూక్ష్మనీటి పారుదల లక్ష్యం

కలెక్టరేట్: జిల్లాలో 2,400 హెక్టార్లలో ఉద్యాన, వ్యవసాయ పంటలకు సూక్ష్మనీటి పారుదల పథకం అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా సూక్ష్మనీటి పారుదల పథకం అధికారి ఆర్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.11.17 కోట్ల మేర రైతులకు రాయితీగా అందిస్తామన్నారు. దీనిలో కేంద్రం వాటా 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 40శాతం ఉంటుందన్నారు. నీరు, విద్యుత్తు, ఎరువులు ఆదా అవుతాయని, కూలీల ఖర్చు తగ్గుతుందని, కలుపు సమస్య తక్కువగా ఉంటుందని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ పథకంలో పండ్ల తోటలైన కొబ్బరి, ఆయిల్‌పామ్, జామ, మామిడి, జీడిమామిడి, మొక్కజొన్న, పత్తి, మిరప, కూరగాయల పంటలకు అందిస్తామన్నారు. అలాగే స్ప్రింకర్లను పెసర, మినుము, వేరుశనగ పంటలకు అందిస్తామన్నారు. బిందు సేద్యానికి సంబంధించి చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీపై అందిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తైక్వాండోలో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు


క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం స్పోర్ట్స్: అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. అదేవిధంగా ఇద్దరు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరిని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ముఖ్య సలహాదారు పి.సుందరరావు అభినందించారు. కోచ్, మేనేజర్లుగా బి.ధనుంజయ రావు, నీరజ వ్యవహరించారు.

భాషోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


డీఈవోకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

గుజరాతీపేట: భాషో పాధ్యాయులు ఎదుర్కొంటు న్న సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా ప్ర తినిధులు కోరారు. ఈ మేర కు సోమవారం డీఈవో ఎస్.తిరుమల చైతన్యను కలిసి వినతి పత్రం అం దించారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల్లో భాషోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, పని సర్దుబా టులో ఉపాధ్యాయులకు, విద్యార్థికి 1:40 నిష్పత్తిగా ఉండన్నారు. 3 నుంచి 10వ తరగతులకు ఉన్న పాఠశాలల్లో రెండు తెలుగు పోస్టులను కేటాయించాలని, పదో తరగతి హిందీ పాఠ్యపుస్తకాన్ని సరళీకృతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, కె.రంగనాయకులు, ఆర్.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, జి.మేరీ ప్రసాద్, జి.వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

గోగు నారతో విలువ ఆధారిత ఉత్పత్తులు

ఆమదాలవలస: గోగు నారతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా యువతకు ఉపాధి చేకూరుతుందని వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ జి.చిట్టిబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గోగునార ఉత్పత్తుల తయారీపై మూడు రోజుల శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. కాలికి వేసుకొనే చెప్పుల నుంచి తలకు వేసుకొనే టోపీ వరకు అనేక రకాల గృహోపకరణాలు తయారు చేసుకోవచ్చునన్నారు. జూట్ బ్యాగ్‌లు తయారు చేసే విధానం, అలాగే చేతి ఉత్పత్తుల తయారీపై ప్రత్యేకంగా మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ ఇస్తున్నట్టు శాస్త్రవేత్త డాక్టర్ బి.స్వాతి తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్తలు సంధ్యారాణి, శ్రీనివాస్, జ్యోతి, ఎన్‌జీవో ప్రతినిధులు ప్రకాష్ పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

అరసవల్లి: బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు అత్యంత శ్రేష్ఠమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని బలగ సెక్టార్ బావాజీనగర్ అంగన్ వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీడీపీవో శోభారాణి, నాయకులు చిట్టి నాగభూషణరావు, తంగి నర్సింగరావు, రెడ్డి ఆమని, రెడ్డి సూర్యనారాయణ, రెడ్డి పాల్గొన్నారు.

- **కవిటి** మహిళల ఆరోగ్యం సంక్షేమంపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని మాజీ జడ్పీటీసీ బి.రమేష్ అన్నారు. కవిటిలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అలాగే సీమంతం నిర్వహించారు. దూగానపుట్టుగ, బట్టివాని పాలెం, మాణిక్యపురం, కళింగపట్నం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేతలు ఎ.మధు, వి.రంగారావు, బి.తిరుమలరావు, బి.కామ రాజు, ఎ.రాజు,కూటమి నేతలు పాల్గొన్నారు.
- **కంచిలి:** తల్లిపాలు బిడ్డకు శ్రేయస్సు కరమని సీడీపీవో ఇందిర అన్నారు. తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా సోమవారం కంచిలి పంచాయతీలో సామూహిక సీమంతాలు జరిపారు. ఏపీడీపీవో గోవిం దరాజులమ్మ, సూపర్‌వైజర్లు, హెల్త్ స్టాఫ్, అంగన్వాడీ వర్కర్లు, సర్పంచ్ పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న కౌన్సిలర్ దిలీప్

- **ఇచ్ఛాపురం:** తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివని 22వ వార్డు టీడీపీ కౌన్సిలర్, టీడీపీ నాయకులు కాళ్ల దిలీప్ అన్నారు. సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, ఏఎస్ఎం శాంతి పాల్గొన్నారు.
- **రణస్థలం:** పిషిని పంచాయతీ పరిధిలోని మాదిగపేటలో సోమవారం జరిగిన తల్లిపాలు వారోత్సవంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు గొండు సీతారాం పాల్గొని మాట్లాడారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. బాలల సంరక్షణ అధికారి కేవీ రమణ, సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, సీడీపీవో ఝాన్సీరామ్, బొంతు జగన్నాథం పాల్గొన్నారు. అలాగే మెంటాడ గ్రామానికి చెందిన హిజ్రా అనుష జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభం

గార: బోరవానిపేట సమీపంలోని వరినాట్లు వేసిన పొలంలో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ స్తంభం విరిగి కూలిపోయింది. దీంతో బోరవానిపేట, శాలిహుండం, పూసర్లపాడు, అంబళ్లవలస, బూరవెల్లి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేక వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. సమాచారం తెలుసుకున్న వెంటనే విద్యుత్ ఏఈ ఎల్.పవనమూర్తి, లైన్ ఇన్‌స్పెక్టర్ సనపల గోపి సిబ్బందితో కలిసి యుద్ధ ప్రాతిపదికన విరిగిపోయిన దాని స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి.. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

అభివృద్ధిలో జనసేన పాత్ర కీలకం

ఆమదాలవలస: రాష్ట్రంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడి అప్పుల ఊబిలో చిక్కుకున్న రాష్ట్రాన్ని ఆదుకోవడంలో జనసేన పార్టీ కీలకపాత్ర పోషిస్తుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాత్రుని పాపారావు అన్నారు. సోమవారం కొర్లకోట గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్య క్రమంలో నాయకులు పి.వరహానరసింహం, ఎస్.ప్రసాదరావు, నారాయణరావు, వి.చంద్రరావు పాల్గొన్నారు.

- **కవిటి:** జగతి గ్రామానికి చెందిన రిటైర్డు డీఎస్పీ శమళ్ల ప్రసాద్ సోమవారం జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సభ్యత్వ నమోదు జగతి గ్రామంలో జరిగింది. రిటైర్డు పోలీసు అధికారి పార్టీలో చేరడం నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం కానున్నదని దాసరి రాజు అన్నారు. జనసైనికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఇచ్ఛాపురం: నియోజకవర్గంలో గల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని ఉద్దానం యువజన జేఏసీ కన్వీనర్ డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ కోరారు. ఈమేరకు సోమవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ నివాసంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రత్తకన్న రోడ్డు రైల్వే ఉత్తర కేబిన్ వద్ద అండర్‌పాస్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని, ఉద్దానం కోకోనట్ పార్క్ నిర్మించాలని, నదుల అనుసంధానం చేయాలని కోరారు. కవిటిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, కవిటి-కొత్తూరు నుండి జగతి బావన వీధి వరకు సీసీ రోడ్డు నిర్మించాలని, డయాలసిస్ సెంటర్‌లో బెడ్స్ సంఖ్య పెంచేలా కృషి చేయాలన్నారు.

- **కవిటి:** ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను సోమవారం నియోజకవర్గానికి కొత్తగా నియమితులైన అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సోంపేట సీఐగా బాధ్యతలు తీసుకున్న బి.మంగరాజు, ఇచ్ఛాపురం తహసీల్దార్‌గా నియమితులైన ఎస్.వెంకటరావు ఎమ్మెల్యే అశోక్‌ను రామయ్యపుట్టుగలో కలుసుకున్నారు.

డొక్కా సీతమ్మ జీవితం ఆదర్శం

రణస్థలం: డొక్కా సీతమ్మ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని జనసేన కార్యకర్తలు గొర్లె సూరిబాబు, ఎం.అప్పన్న గత 240 రోజులుగా అన్నదానం కార్యక్రమం చేపట్టడంపై అభినందించారు. యువత సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో జనసేన నేత విశ్వక్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తీవ్ర అన్యాయం

సరుబుజ్జిలి: రాష్ట్రంలో రైతులకు సర్వ హక్కులు కల్పిస్తూ వైసీపీ ప్రభుత్వం రూపొందించిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దు చేసి రైతులకు తీరని అన్యాయం చేశారని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సరుబుజ్జిలిలో పార్టీ మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వర రావు ఆధ్వర్యంలో వైసీపీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. నాయకులు కేవీజీ సత్యనారాయణ, జడ్పీ టీసీ సురవరం నాగేశ్వరరావు, పేడాడ చిరంజీవరావు, గోవింద వెంకట శివానందమూర్తి పాల్గొన్నారు.

బీటీఏ నూతన కార్యవర్గం

గుజరాతీపేట: బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ పర్యవేక్షణలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా గౌరవ సలహాదారుగా ఎస్.వెంకట్, గౌరవాధ్యక్షుడిగా ఎస్.నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా ఎస్.రమేష్‌బాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.లక్ష్మణరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.షన్ముఖరావు, ప్రధాన కార్యదర్శిగా పి.ప్రతాప్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శిగా పి.శ్యామ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.నూకరాజు, మహిళా కార్యదర్శిగా ఎం.రత్నం, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎస్.తిరుపతి, ఓపిఎస్ సాధన కన్వీనర్‌గా సీహెచ్ బాలకృష్ణ, కార్యదర్శిగా ఎం.సత్యంలను ఎన్నుకున్నారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నగిరి మోహనరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామారావు, బి.తాతారావు, రాష్ట్ర కార్యదరి కె.ఆనంద్ ఉన్నారు.

రైతులకు అండగా ఉంటా

అరసవల్లి: నియోజకవర్గంలో రైతులకు ఏ కష్టం వచ్చినా వారికి అన్నివేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సింగుపురంలోని ఓ కల్యాణ మండపంలో సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పొలంబడిలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు రైతుల కష్టాలు తెలుసని, వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలని అధికారులను కోరారు. వ్యవసాయశాఖ అధికారులు, స్వీప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రమణమూర్తి, బొంతా అన్నపూర్ణమ్మ, కుంచాల ఆదినారాయణ, పంగ సత్యనారాయణ, బోర గోవిందరావు, రైతులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరు

అరసవల్లి: నారాయణపురం, తోటపల్లి కుడి కాలువ ద్వారా ఈ నెల 6న సాగునీరు విడుదల చేయనున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నారాయణపురం, తోటపల్లి కాలువలకు సకాలంలో నీరు విడుదల చేయకపోవడంతో వేలాది రైతులు తీవ్ర అవస్థలు పడ్డారన్నారు. నీరందక ఇబ్బందులు పడుతున్న రైతుల ప్రయోజనమే లక్ష్యంగా శివారు భూములకు సాగునీరు అందిస్తామన్నారు. ఇప్పటికే తోటపల్లి రిజర్వాయర్ నుంచి సాగునీరు విడుదలకు చర్యలు తీసుకున్నామని వివరించారు.

కళాకారుల సమ్మేళనం

కవిటి: కె.కపాసుకుద్దిలో సోమవారం ఉద్దానం ప్రాంత కళాకారుల సమ్మేళనం నిర్వహించారు. రామలింగేశ్వర ఆలయంలో జానపద కళాకారుడు టి.ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం చేపట్టారు. అనంతరం ఉద్యానవన ప్రాంత కళాకారులను సత్కరించారు. ఇచ్ఛాపురం ఎంపీపీ బి.పుష్ప, మాజీ ఎంపీపీ కె.మోహనరావు, గ్రామస్థులు కె.భీమసేను, టి.ధర్మరాజు, జానకిరావు పాల్గొన్నారు.

సమాజ సేవే రోటరీ ధ్యేయం

ఇచ్ఛాపురం: సమాజ సేవే రోటరీ ధ్యేయమని సంస్థ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రాజు సుబ్రహ్మణ్యం అన్నారు. విశాఖలోని ఓ హోటల్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవలో ఇచ్ఛాపురం రోటరీ క్లబ్‌కు చెందిన పాస్ట్ ప్రెసిడెంట్స్ దక్కత త్రినాథరెడ్డి, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, ఎంజీ రామన్, డి.కృష్ణారావు, డి.కృష్ణారావు, నవీన్ చౌదరి, నరేంద్రపాణి గ్రాహి, మల్లికార్జునరావు, రామకోటిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పలువురు అభినందించారు.